
# సిరిగల తల్లి.....




దేవుడేం చేయదలిచేడో గానీ, మిస్ అరుణాకుమారికి ప్రపంచంలోని దుఃఖంగానీ, కష్టాలు గానీ బొత్తిగా తెలీవు. ఆ పిల్లతండ్రి జస్టిస్ నిరంజనరావుగారు కేవలం పెద్దా తోనే గాకుండా డబ్బువల్లనూ 'పెద్దవా డవడి' దానికి ముఖ్య కారణం. ఇంట్లో గుర్రాల తర్వాత ఆ పిల్ల ఒక్కగా నొక్క ఆడపిల్ల, అందునా తల్లి లేనిది. ప్రస్తుతం అరుణ వయస్సు పదిహేడు.

జస్టిస్‌గారికి తరుచూ జరిగే బదిలీల వల్ల అరుణమ్మ ఒకే స్కూళ్లో [illegible]రుగా చదుకున్నది గాదు. డాడీకి బదిలీ వొచ్చిన ప్రతి తడవా అక్కడ స్కూళ్లో బంగళా మార్చి మరో వూళ్ళో కొత్త బంగళాలో కాలుంచవలసి వొచ్చేది. డాడీకి అరుణమ్మ ఆరో ప్రాణం కావడం వలన ఆయన ఆ పుత్తడి బొమ్మని వెంట బెట్టుకు తిరిగేవారు. ఆయనగారి విద్వత్తు ఈ బంగారు బొమ్మ పెంపకం విషయంలో నిరూపించేరు గూడాను.

అన్నయ్యల పరిస్థితి ఇలా కాదు. మగవాళ్ళు కనక వాళ్ళంతా ఏదో ఒక వూళ్ళో హాస్టల్లో మకాంపెట్టి చదువు ముగించి ఘనమైన ఉద్యోగులై, పెళ్ళిళ్లు చేసుకున్న ఇంటివాళ్లై తలో వూళ్లోనూ స్థిరపడిపోయేరు.

అరుణమ్మ చదువు ఎక్కువగా ఇంటి దగ్గరే చదువుకుంది. ఆరో ఏటనుంచి ఆ పిల్ల ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడం నేర్చుకుంది. కొంత చదువు దొరసానులు చెప్పేరు. ఎక్కువగా ప్రత్యేకంగా డాడీనే చెప్పేరు.

ఈ పదిహేడు వసంతాల్లోనూ అరుణమ్మ ప్రపంచం మొహం పనిగట్టుకు చూళ్లేదు. ఆ అమ్మాయికి తెలిసిన ప్రపంచం బహు చిన్నది. ఆ ప్రపంచంలో డాడీ ముఖ్యుడు. తర్వాత ఆంటీ, ఆ తర్వాత అన్నయ్యలూ, వొదినలూ, కొందరు బంట్రోతులూ, అందమైన కార్లూ, కుక్కలూ—విలువైన బంగళాలూ [illegible]లూను. ఇంతకి వెయ్యిరెట్ల ప్రపంచం బయట జీవిస్తోందని పాపమా అరుణమ్మకి బొత్తిగా తెలీదు.

జస్టిస్ కోర్టు కెళ్ళేముందు, కోర్టు నుంచి వచ్చిన వెంటనే అరుణమ్మని దగ్గిరికి తీసుకునేవారు. కళ్ళల్లో ఇంత ఆనందంతోపాటు [illegible] నింపుకుని 'నా తల్లి క్షేమంగా వుంది. నా తల్లి బొమ్మలా అందంగా వుంటుంది. నా తల్లి అమృతాన్ని తాగిన అప్సరస. నా తల్లి నాకో వరం' అనుకునేవారు.

జస్టిస్ కోర్టులో వున్నప్పుడు, ఇంటి దగ్గిర ఆంటీ కళ్ళల్లో వొత్తులు పెట్టుకుని అరుణమ్మని చూచుకునేది. ఇంటి దగ్గిర తిరిగే బంట్రోతులూ వగైరా వాళ్ళు, వాళ్ళ కష్టగాథలు చెప్పుకునే సమయంలో ఆ పిల్లని చివరి గదిలో వుంచి వొచ్చి ఆ జనాభాని తూకలు వేసేది ఆంటీ!

ఆంటీకి గూడా ఒక కథ వుంది. అది విడ్డూరమైన కథ. పరిశీలించి చూస్తే కష్టాల కథ. ఆంటీ జీవితంలో బాగా చితికిపోయిన మనిషి. చిన్నతనంలోనే కన్నవాళ్ళు ఆంటీకి పెళ్ళి చేసేరు. కట్టుకున్నవాడు ఏదో మాయదారి రోగంతో రెండేళ్ల వ్యవధిలో కన్ను మూసేడు. అప్పట్నుంచీ ఆంటీ అత్తవారింట్లో వూడిగానికి నిలిచిపోయింది. వాళ్ల దగ్గిర లభించే అనాదరణకి కడుపునిండా తినేసి కన్నీరు పెట్టుకునే ఈ పాడు జాతకానికి పదిహేడేళ్ళ క్రితం అందమైన మలుపు దొరికింది. ఈ నిరంజనరావుగారే

స్వయంగావచ్చి ఆంటీని కోరేరు — "నా తల్లికి తల్లిలేదక్కా! వొచ్చెయ్" అని పదిహేడేళ్ళక్రితం అంతే తనతమ్ముడింటికి వొచ్చిచేరింది. ఇక్కడున్న సుఖాలని రుచి చూచింది. అరుణమ్మని గుండెలకు హత్తుకుని, పాత కష్టకథకి వీడ్కోలిస్తూ అనుకునేది — "అమ్మడూ! నువ్వు నా పాలిట దేవతవి. ఈ పాపిష్టి చేతులకి నీ మూలంగా ఒక అలంకారం లభించింది. ఈ దిక్కుమాలిన జన్మకి నీవల్ల స్వర్గం దొరికింది. ఇప్పుడు చెప్పమ్మడూ, నాదిగదూ అదృష్టం!"

అరుణమ్మని ఆంటీ చేతుల్లో వుంచినప్పుడు జస్టిస్ ఒక గొప్పని జాన్ని గూడా హెచ్చరించేడు.

"అక్కా ఇదినాకూతురు, నాప్రాణం, నా లక్ష్మి, నా సౌభాగ్యం, నాకు అన్నీని. ఈ పాపకి తల్లిలేదు. "తల్లిలా పెంచే చల్లనిచేతి కోసం నేను కొన్నాళ్ళు వెదికి నిన్ను ఎంచుకున్నాను. తల్లిప్రేమనెలాగో నువ్వందించలేవు. మాటకి అడ్డురావద్దక్కా! నన్ను చెప్పనివ్వు. మనసున్న ఆడదానివిగానైనా నా తల్లిని పెంచు. ప్రేమించు. కళ్ళు తెరవని ఈ పసిమూన రేవు కళ్ళు తెరచినప్పుడు మనిషికిజరిగే అన్యాయాలుగానీ, మనిషి పొందే దుఃఖం, బాధలుగానీ చూడకూడదు. ఈపాప కన్నీరు పెట్టుకుందికి వీల్లేదు. ఈ పాపనిత్యం నవ్వడం నేర్చుకోవాలి. దబ్బెంతైనాఫర్లేదు. నేనిస్తాను. నువ్వు ప్రేమనివ్వు. పాపకి సుఖాన్నివ్వు. నేరాలూ, నేరస్తులు - చట్టాలూ, శిక్షలూ వీటితో నా తల బొప్పి కడుతోందక్కా. కొన్నేళ్ళకి నేనీ వలనుంచి బయట పడతాను. స్వతంత్రుణ్నవుతాను. అప్పుడు నా తల్లిలో నేను నిండుతనాన్ని, నిర్మలత్వాన్ని, పరవళ్ళుతొక్కే ఆనందాన్ని చూడాలి. అంచేతనే దీన్ని నీ చేతుల్లో వుంచుతున్నాను. మన్నించు - పెద్దదానివనే గౌరవాన్ని సైతం మరిచి మిలట్రీ మనిషిలా కటువుగా మాటాడేనేమో! అయినా సరే, ఈ మల్లెపూవుని మల్లెపూవులాగానే నా చేతికందించు. ఇది నా ప్రార్థన. ఆజ్ఞ."

అందుచేత ఈతి బాధలు చెప్పుకునే పెద్దలుగానీ, బీదమొహాల్తో వొచ్చే బంధుపోతులుగానీ అరుణమ్మ ఎదట నిలిచే వాళ్ళు కాదు. ఆ ఇంట్లో ఒకానొక విడ్డూరమైన ఆడపిల్ల అతి గారాంగా పెరుగుతోందనే సత్యం జస్టిస్‌గారి నెరిగిన ప్రతివాళ్ళకీ తెలుసు.

అరుణమ్మని అలా పెంచేయడం అన్యాయమని అన్నలు అనుకున్నారే తప్ప తండ్రితో అనలేకపోయేరు. ఈరకమైన పెంపకం వల్ల జరిగే కీడు అరుణమ్మకే జరుగుతుందని వాళ్ళు భావించేరే తప్ప తండ్రి దగ్గర నోరెత్తలేకపోయేరు. అక్కడికీ ఆ టీతో, ధైర్యంచేసి ఆ ప్రస్తావన తెచ్చినప్పుడు — ఆంటీ భయపడ వాళ్ళ నోళ్ళని మూసింది.

"కొంప తీయకండబ్బాయిలూ! మీ హితోపదేశాలు నాకు చెప్పకండి. ఈ ఉపదేశాలతోనా మెదడుపాడు చేయకండి. ఎన్నో ఏళ్ళ తర్వాతనే నిప్పుడిప్పుడేసుఖ పడుతున్నాను. వెళ్ళిపోండి నాయనలూ, మీకు చేతులెత్తి నమస్కారం చేస్తాను. నా బతుక్కి ఉచ్చులు పన్నకండి బాబూ! మీకు వెయ్యి దండాలు" అని ఖచ్చితంగా వాళ్ళందర్తో చెప్పింది.

అన్న వొదినలూ ఇతర ఆత్మబంధువులంతా అరుణమ్మకి తలలొగ్గి మాటాడేవారు. ఏం మాట తేడా వొస్తే ఏ కొంప మునుగుతుందోనని భయపడి అతి జాగ్రత్తగానూ మాటాడేవారు.

"వొదినలూ! ఆరూ మూడూ పదిగదూ!" అని అరుణమ్మ అడిగిందే తడవు "అవునమ్మా అవునని" జాయింటుగా వొదినలంతా తల లూపేవారు. "అన్నయ్యలూ మీరుత్త పిరికిదద్దమ్మలు కదూ" అని అన్నల్నడిగితే "అవునవును చెల్లీ! అది మా ఖర్మ" అనేవారు.

అంత గారాంగా పెరిగింది అరుణమ్మ.

ఆ రోజు మెట్రిక్యులేషన్ పరీక్షా ఫలితాలొచ్చాయి. అరుణమ్మ పరీక్ష ప్యాసయింది. అరుణమ్మ పరీక్ష ప్యాసైన సందర్భంగా జస్టిస్‌గారు క్లబ్బులో కొందరాత్మీయులకి పార్టీనిచ్చేరు. ఆ పార్టీలో వారు ఇలా సెలవిచ్చారు—

"నా కల నిజమయ్యే రోజు దగ్గిర పడింది ఫ్రెండ్స్! నా తల్లి పరీక్ష ప్యాసైంది. నా వెలుగు ఎప్పుడూ ఎక్కడా ఫెయిలవదు. అలా అని నే నీ రోజు మీ ముందు రాసిస్తాను. నేను రిటైరవబోతున్నాను. ఇన్నేళ్ళుగా నేను నా ఉద్యోగానికి బానిసనై పోయేను. ఇక నాక్కావలిసినంత విశ్రాంతి. నా కన్నతల్లితో నాక్కావలిసినంత కాలక్షేపం. దైదివే — మీ ఎరికలో మంచి సంబంధముంటే చెప్పండి. నాలుగేళ్ల తర్వాత నాకు అలుడు కావాలి. ఇప్పట్నుంచే మీరు వేట ప్రారంభించండి. ముఖ్యంగా — ఆ రాబోయే అలుడు మాతోపాటు మా దగ్గిరే వుండిపోవాలి. అదంతే. అతనికి డబ్బుండక్కర్లేదు. నా దగ్గిర బోల్డుంది. అతను ఐ ఏ యస్ కానక్కర్లేదు. మనిషి విలువ తెలుసుకునే అర్హతుంటే చాలు. అతని కులం ఏదైనా ఫర్లేదు. మంచితనం కావాలి. అన్నిటికంటే ముఖ్యం అతను ఆడదాన్ని గౌరవించేమనిషై వుండాలి. ఇవి చాలు. ఈ గుణాలున్న మానవుడెవడైనా సరే, మీ కంటపడితే వొదిలెట్టకండి. ఒక్క నాలుగేళ్ళపాటు అతన్ని పెంచండి, అతని సుగుణాలకి అందమైన రంగులు వేయండి. ఆ దరిమిలా నా కతన్ని చూపించండి."

* * *

నన్ను "అరుణ" అని చాలామంది అంటారు. డాడీ — నన్ను "తల్లీ" అని "అమ్మా" అని గూడా పిలుస్తారు. ఆంటీ నేమో "అమ్మడూ" అంటుంది.

డాడీ రిటైరైన తర్వాత నేను డాడీ ఆంటీలతోపాటు ఈ వూరొచ్చేసేను. ఇక్కడ మాకో ఇల్లుంది. డాడీ ముచ్చటకొద్దీ ఈ ఇల్లు కట్టుకున్నట్టు ఆయనే చెబుతాడు. మే మిక్కడికి రాక ముందు నుంచీ ఈ ఇంట్లో పెద్దన్నయ్యా, పెద్ద వొదినా వుంటున్నారు. మే మొచ్చేం తర్వాత వాళ్ళక్కడ్నుంచి వెళ్ళిపోదా మనుకున్నారుగాని, డాడీ అందుకు వొప్పుకోలేదు. అందుచేత వాళ్ళు ఈ ఇల్లొదిలి వెళ్ళిపోనూలేదు.

ఇక్కడి వూళ్ళోనే పెద్దన్నయ్య పలుకుబడిగల పెద్ద డాక్టరు!

నేనివూరు కాలేజిలో పి. యు. సి. లో చేరేను. మా కాలేజీగురించి నేను కొంత చెప్పక తప్పదు.

మొట్టమొదటి రోజు, డాడీ నాతో పాటు మా కారులోవొచ్చి నన్నిక్కడ దించి వెళ్ళినప్పుడు ఈ ప్రదేశమంతా నాకు చిత్రంగా కనిపించింది. ఆవరణలో కళ్ళు చెదిరే రంగు రంగుల సీతాకోక చిలకల్లా నా ఈడు ఆడపిల్లలు తిరగడంతో నా కెంతో ఆనందం కలిగింది. భూమ్మీద ఎవరో దేవుడు ముచ్చట కొద్దీ రంగు కుంచెని విదిలించినప్పుడు రంగుకొక బొమ్మగా తయారైనట్టున్నారు వాళ్ళు (మా కాలేజిలో మగపిల్లలు లేరు) మా క్లాసులో మొత్తం నలభైమందిమి కలిసి చదువుకుంటున్నాం. వాళ్ళంతా నాతో చనువుగా, స్నేహంగా మాట్లాడేరు. మొదటిరోజునే మేమంతా ఆత్మీయులమై పోయేం.

సాయంత్రం సరిగ్గా అయిదుగంటలకి డాడీ కారు తీసుకొచ్చేరు. నేను నా నేస్తాల్ని డాడీకి పేరుపేరునా పరిచయం చేసేను. నేను వెళ్ళేదార్లోనే పార్వతి ఇల్లుట. పార్వతి పొడవుగా వుండి, గాలికెగిరిపోయే మనిషిలావున్నా ఆ రెండు జడలూ పార్వతికి అందంగా వుంటాయి. పార్వతిని నా కారులో కూర్చోవలసిందిగా కోరడంవల్ల, అది చాలా సిగ్గుతో కారెక్కింది.

పార్వతిని వాళ్ళింటిదగ్గరదించి మేము వెడుతుండగా డాడీ అడిగేరు —

"కాలేజీ ఎలా వుందమ్మా?"

"చాలా బాగుంది డాడీ!"

"ఏం పాఠాలు చెప్పేరు?"

నాకు నవ్వొచ్చేసింది. పాఠాలమీద డాడీకి అంత తొందరేమిటో...

"నవ్వుతున్నావే తల్లీ?"

"లేకపోతే పాఠాలేమిటి డాడీ? ఇవాళంతా పరిచయాలే."

"అవుతే నేనో పాఠం చెప్పనా?"

"పాఠమా? చెప్పండి డాడీ?"

"చూడమ్మా, ఇవాళ మొదటిరోజు గనక పార్వతిని కార్లో ఎక్కించుకున్నావు. తప్పులేదు. కాని తల్లీ, రేపట్నుంచి ఆ పిల్ల నీకారే కావాలనే చొరవని నువ్వు ఇవ్వకు."

"అదేం డాడీ?"

"ఇదో పాఠం తల్లీ!"

డాడీ పాఠం నాకప్పుడు అర్థం కాలేదు.

— రోజూ, డాడీ కార్లో నాతో పాటు కాలేజికి వొచ్చేరు. మళ్ళా సాయంత్రం వొచ్చి కార్లోనే ఇంటికి తీసుకొచ్చేవారు. రానురాను డాడీమీద నాకు విసుక్కలగడం ప్రారంభమయ్యింది. ఓ రోజున నోరు జారేను గూడా.

"చూడండి డాడీ! మీ రిలా నిత్యం నన్ను కాలేజీలో విడిచి, మళ్ళా సాయంత్రం ఇంటికి తీసుకెళ్ళడం ఏం బాగోలేదు. నేనేమైనా పసిపాపనా? పైగా - కారెలాగో నాకూడా వుండనే వుంటుంది. డ్రైవరూ ఉంటాడు."

డాడీ ఏవనుకున్నారోగాని వెంటనే జవాబు చెప్పలేదు. అందుచేత నేనే మళ్ళా మాట కలగ జేసుకున్నాను.

"సారీ డాడీ! నేనేమైనా పొరపాటు మాటాడేనా?"

"లేదమ్మా, నీ పొరపాటేం లేదు. అవునుగానీ, నేనిలా వొచ్చిపోవడం బాగోలేదని ఎవరైనా నీతో అన్నారా?"

"లేదే."

"నా కొక్కడికీ ఇంట్లో తోచదు గదా. అందేత మరి... పోనీలే. రేపట్నుంచి నేను రాను. ఒకె?"

"ఒకె డాడీ!"

డాడీ నా కోసం ఏమైనా చేయగలరు!

ఇక్కడే—ఒక సాయింత్రం గురించి కూడా చెబుతాను.

ఆ రోజు లాసవరు క్లాసు కొంచెం లేటుగా వొదిలేరు. అది చీకటి పడే వేళ కాదుగాని, ఆకాశాన్నంతా మబ్బులాక్రమించడంవల్ల వెలుగు తక్కువయింది. ఈదురుగాలితోపాటు వర్షం టుప్పుర్లూ ప్రారంభ మయ్యేయి. ఆ రోజు కారు గూడా ఆలస్యంగా వొచ్చింది. గబగబా కారు దగ్గిరికి నడిచేను.

డ్రైవరు కారు తలుపు తెరిచి నించుని అన్నాడు.

"వేగిరం ఎక్కండమ్మా."

కార్లో కూచున్న తర్వాత జ్ఞాపకం వొచ్చింది. పాపం, నా వెనకాతలే వొస్తూన్న పార్వతి ఈ వర్షంలో ఇంటికి నడిచి వెళ్ళడం కష్టమవుతుందని. అప్పటికే మా కారు వేగం అందుకుని తూనీగలా పోతోంది. ఎన్నడూ లేనంత వేగంగా కారుని ఇంటికి చేర్చేడు డ్రైవరు.

కారు దిగి ఇంట్లోకి అడుగుపెట్టేను. ఆంటీ ఎదురుగా వొచ్చి అన్నది—

"వొచ్చేవా అమ్మడూ! తొరగా వెళ్ళు. మీ నాన్న గదిలో వున్నాడు."

ఆంటీ మాటలో "విడ్డూరం" వినిపించింది.

నేను డాడీ గదిలోకి అడుగుపెట్టి అక్కడి దృశ్యాన్ని చూసీ చూడటంతో స్తంభించి పోయేను. డాడీ ఆ పెద్ద మంచాన్ని పూర్తిగా ఆక్రమించుకుని వెల్లకిలా పడుకుని వున్నారు. పెద్దన్నయ్య స్టెతస్కోపుతో డాడీ గుండెని పరీక్షిస్తున్నాడు. పెద్దన్నయ్య మొహంలో ఆందోళన స్పష్టంగా కనుపిస్తోంది. పెద్దొదిన డాడీ కాళ్ళ దగ్గిరగా నిలబడి వున్నది.

నా కెందుకో భయం వేసింది.

నే నెప్పుడూ భయపడ్లేదు. భయం గురించి నాకసలేంతెలీదు. డాడీని ఆ పరిస్థితిలో నేనింతకుముందు చూళ్ళేదు. కనీసం వూహించనైనా లేదు.

"నాన్నకి ఆరోగ్యం సరిగ్గాలేదు. దగ్గిరికి వెళ్ళు" అన్నది ఆంటీ.

నేను మెల్లిగా అడుగులు లెక్కపెట్టుకుంటూ డాడీ మంచం దగ్గిరికి వెళ్ళేను. అన్నయ్య స్టెతస్కోపు తీసుకొంటూ డాడీతో అన్నాడు.

"అరుణొచ్చింది నాన్నా! అరుణొచ్చింది."

ఈ అదును డాడీ జబ్బుకి సరైన సందని డాక్టరన్నయ్యకి తెలుసుకాబోలు! క్షణంలో కళ్ళు తెరిచేరు డాడీ. నన్ను చూచి చిన్నగా నవ్వేరు. ఆ పెదాల మీద అంతందమైన నవ్వు కళ్లనుంచి తొణికిన రెండు కన్నీటి బొట్లతో మాయమైపోయింది.

"డాడీ ఏడుస్తున్నారా? డాడీ మీ రేడవకండి! ఎందుకేడుస్తారు? మీ రేడవకూడదు. నే నొచ్చేసేను డాడీ. మీ కేం ఫర్లేదు. నో డాడీ. దటీజ్ జే! వెరీ బేడ్. ఇందాకటి మీ నవ్వు నాకు కావాలి డాడీ! ఏదీ నవ్వండి."

నన్ను ఇంకా దగ్గరగా రమ్మన్నట్టు కళ్ళతో సైగచేసేరు. వెళ్ళి ఆయనకి కుడిపక్కన నిలబడ్డాను. ఆయన నా చేతులు రెండూ పుచ్చుకుని కళ్లమీదకి తెచ్చుకున్నారు. డాడీ కన్నీరు వేడిగా నా చేతుల్ని తాకడంతో నేను ఉలిక్కిపడి ఆయన మొహంలోకి తిన్నగా చూసేను.

డాడీ మెల్లిగా గొణిగినా నా కది స్పష్టంగా వినిపించింది.

"నా జ్యోతొచ్చింది. నా ప్రాణం వొచ్చింది. నా కేం భయంలేదు. మీ రంతా వెళ్ళిపోండి దూరంగా. నాతల్లి చల్లని చేతిస్పర్శతో నేను మళ్ళీ బ్రతికేను. ఒరే డాక్టరూ! నాకు రెస్టు కావాలిరా! ఐవాంట్ రెస్ట్. నాజబ్బు మీద నీప్రయోగాలు వేస్తూ. వేస్తూ. వేస్తూ. వెళ్ళిపో..."

ఆ సాయంత్రమే అర్ధరాత్రిగా మారినప్పుడు డాడీ మగతగా నిద్రపోయేరు. అన్నయ్య నన్నివతలకి పిలిచి అన్నాడు.

"నువ్వెళ్ళి పడుకో. ఇంక ఆయనకొచ్చిన భయంలేదు."

బలవంతాన నన్నవతలకి పంపేడన్నయ్య. పక్కమీద నడుం వాల్చేనే గాని డాడీగురించిన ఆలోచనలు దూరం కాలేదు.

తెల్లవారుతూండగా కాబోలు, డాడీ గదిలోంచి అంటీ ఏడుపు వినపడింది. దిగ్గున లేచి డాడీ దగ్గిరికి వెళ్ళేను. ఆ గదిలో అన్నయ్యా, వొదినా, అంటీలే కాకుండా మరికొందరు పెద్దలున్నారు. వాళ్లంతా గుమ్మమ్మోదనించున్న నన్ను ఒకేసారి చూసేరు.

అంటీ నన్ను ఆమె గుండెలకు జరిగి అదుముకుంటూ అన్నది.

"అమ్మడూ! అన్యాయమైపోయిందే తల్లీ. నా తమ్ముడు ఇకలేడు. మీనాన్న..."

అంటీ చెబుతూన్న "చావు" గురించి గూడా నాకు తెలీదు. డాడీ చచ్చిపోయేరా? వీళ్లకెవళ్లకీ బుద్ధిలేదు. డాడీ చావడమా? నాన్సెన్స్— చూడండి ఆయనెంత ప్రశాంతంగా నిద్రపోతున్నారో? దేవుడి కెక్కడయినా చావంటుందా అసలు? దేవుడు చావడు అంటీ. నువ్వు పిచ్చిదానివి.

డాడీ దగ్గిరిగా వెళ్ళి నించున్నప్పుడు నా వెనక అంటీతో పాటు పెద్దొదిన గూడా రెడీగా వున్నది. వాళ్ళిద్దరి మొహాల్నీ చూచి, మెల్లిగా డాడీ పెదాలమీద నా చుబుకాన్ని వుంచేను.

పూర్ డాడీ! నన్ను ముద్దాడలేదు, డాడీ!

* * *

హార్టు ఎటాక్స్ అనగా అకస్మాత్తుగా గుండె ఆగిపోడాలు కొందరి గొప్పవాళ్లకొచ్చే అందమైన జబ్బు. ఆ జబ్బు చేతనే జస్టిస్ నిరంజనరావుగారు పోయేరని అందరూ వొప్పుకున్నారు. ఆ పెద్దమనిషి పోయి రెండునెలలు గడిచినా, ఆ దిక్కుమాలిన వ్యాధిగురించి డాక్టరు వాణీప్రసాదు, యింటికొచ్చే పెద్దమనుషులందర్తోనూ గంటల తరబడి ఉపన్యసించడమనేది అరుణమ్మకినచ్చింది కాదు.

అరుణమ్మకి —డాడీ లేడనే భయంకరమైన నిజం ముందు, హార్ట్ ఎటాక్స్ అనే మాయదారి వ్యాధి ఒక లెఖ్ఖలోనిది కాదు.

అన్నయ్యకి పిచ్చెత్తింది. నిజంగా, అన్నయ్య పిచ్చాడైపోతున్నాడు. లేపోతే, ఎందుకీ ఉపన్యాసాలు? ఎవర్ని ఉద్ధరించను? డాడీ లేరుగా. ఈ ఉపన్యాసాల్తో డాడీ తిరిగి రారుగా. తనని పెంచిన డాడీని మరిచిపోయి, తనని ఓడించిన వ్యాధిని గుర్తుపెట్టుకుంటాడేం అన్నయ్య? అనుకునేది అరుణ.

ఆ సాయంత్రం యింటికొచ్చిన పార్వతితో చాలాసేపు మాట్లాడి, రేపుదయం కాలేజికి వొస్తున్నట్టు చెప్పి పంపింది. ఆరాత్రి పడుకునేముందు అంటీ ఏడుపు వినిపించగా, లేచి అంటీదగ్గిరికి వెళ్ళింది అరుణమ్మ.

"అంటీ ఏడవకు. నీకేం జరగలేదుగా. డాడీ పోయేరంతే. మనమంతా క్షేమమేగా. మరెందు కేడుస్తావ్ అంటీ. ఏడవకు."

అంటీ కళ్ళుతుడుచుకుని అరుణమ్మని చూచి అన్నది—

"అవునమ్మడూ! నే నేడవనింక. నువ్వు నిద్రపోనేలేదా? నిద్రపో. నే నేడవనని చెప్పేగా, ధర్మరాజులాంటి తమ్ముణ్ణి మింగి బతుకుతూన్న దయ్యాన్ని. నాకెందు కేడుపు. నేనేడవనమ్మడూ. వెళ్ళి పడుకో."

"అంటీ డాడీని మరిచిపోలేదు. నేను డాడీని మరవలేను. పెద్దన్నయ్య హార్టు ఎటాక్స్‌, పెద్దవొదిన ఆస్తిపంపకాల్నీ, చిన్నన్నయ్యలూ, వొదినలూ ఈర్ష్యల్నీ, ద్వేషాల్నీ మరిచిపోలేరు. ఈ ఇంటికేదో ప్రమాదమొచ్చి పడింది. ఈ ఇంటిని శనేదో ఆవహించింది. ఇక్కడ బతికే మనుషులకి సుఖం వుండదింక. ఇక్కడ జరిగే విపరీతాలకి అంతువుండదు. డాడీలేరు డాడీ తిరిగిరారు."

అరుణమ్మ పాఠాన్ని చదువుకుని నిద్రకొరిగింది.

స్నానం చేసి అంటీ తెచ్చిన కాఫీ తాగి పుస్తకాలు సర్దుకుంటుండగా వాణీప్రసాదం వొచ్చి అడిగేడు.

"కాలేజికి వెడుతున్నావా?"

"అవునన్నయ్యా!"

"ఇవాళే వెళ్లాలా?"

"అవును."

"ఇవాళే చిన్నన్నయ్యావాళ్ళొస్తున్నారు."

"ఒస్తే..."

"మనం చాలా విషయాలు మాటాడాలి."

"ఏం విషయాలు ?"

"అంటీ చెప్పలేదా ?"

"అవునవును చెప్పింది. డాడీ విల్లు సంగతేకదూ. విన్నాను."

"ఇవాళ మనమంతా కలిసి ఆ పంపకాలెలా జరగాలో ఆలోచించాలి. మధ్యాహ్నం పెద్దమనుషులుగూడా వస్తున్నారు. నువ్వుచూస్తే చిన్నదానివి. నీకేంతెలీదు. మేమేదైనా చెబితే వినిపించుకోవు."

"ఏవిటన్నయ్యా ఈ గొడవ ? మీరంతా ఆలోచించి మీయిష్టమొచ్చినట్టు చేయండి. నేను కాదనను. సరేనా ?"

వాణీప్రసాదం మాటాడలేదుగానీ, వొదినగారు అందుకున్నారు.

"చేయండి. చేయండి. అన్నీ ఏర్పాట్లూ మీరు పూర్తిచేసి వుంచితే రాణీగారు యస్సంటారు. అవతల మీ తమ్ముళ్ళు రాణీగారికి చదువు వొద్దన్న సంగతి చెప్పేరా ?"

"అలాగా వొదినా ? నాకిక గతిలేదు. కాని, వొదినా ఎవరెన్ని చెప్పదలచుకున్నా నేను చదవడం మానను."

"మరేనమ్మా ! నువ్వెందుకు మానతావు... అల్లారుముద్దుగా పెరిగిన బిడ్డవాయె. నీకు వొకళ్ళు చెప్పే పాటివారా ?"

వాణీప్రసాదం కలగజేసుకున్నాడు.

"నువ్వు నోరుమూసుకుందూ ! ఒకతే సోది. ఆల్ రైట్. కాలేజికి టైమయింది కాబోలు నువ్వెళ్ళు అరుణా !"

కాలేజి రోడ్డుమీద కారు వెడుతున్నప్పుడు, అరుణకి మొట్టమొదటి రోజు డాడీ కారులో వొచ్చిన విషయం గుర్తుకొచ్చి మనస్సు చివుక్కుమంది. కాలేజిగేటు దగ్గిర కారు దిగింది అరుణ. డ్రైవరు వినయంగా చెప్పేడు.

"సాయంత్రం కారు రాదండమ్మా !"

"అదేమిటి ?"

"సాయంత్రం పెద్దొదినగారికి క్లబ్బులో మీటింగుందట."

"అందుకు, అన్నయ్య కారుందిగా."

"ఇవాళ బంధువులొస్తున్నారుగా. ఆ కారు వాళ్ళకి కావాలిట."

"సర్లె. నువ్వెళ్ళిపో" అనగలిగింది అరుణ.

నేను చదవడం వొదిన కిష్టంలేదు. నేను చదవడం డాడీ కిష్టం. నేను చదవడం నా కిష్టం. డాడీ యిష్టాన్నీ, నా యిష్టాన్నీ వొదినఖండిస్తోంది డాడీలేరా. డాడీ తిరిగిరారు" అనుకున్నది అరుణ.

ఆ రోజంతా గజిబిజిగా, గందరగోళంగా వున్నది. ఒక్క పాఠమూ అర్థంకాలేదు. ఆ సాయంత్రం తనతో పాటు నడుస్తున్న అరుణని చూచి పార్వతి ఆశ్చర్యపోయింది.

పార్వతి ఇంట్లోకి వెళ్ళబోతూ అరుణని ఆహ్వానించింది. అరుణ తొలిసారిగా పార్వతిఇంట్లోఅడుగుపెట్టింది

అది చిన్నడాబాయిల్లు. అతిసాధారణమైన ఇల్లది లోపలికి అడుగుపెట్టిన అరుణని చూచి ఆవిడెవరో వింతగా చూసేరు. ఆవిడ చేతుల్లో అందమైన బుజ్జి పాపాయి వున్నాడు. వాడూ, ముచ్చటగా బోసినోరు యింత చేసి అరుణ వేపు చూస్తున్నాడు. పార్వతి పరిచయం చేసింది.

"మా పెద్దొదిన. వాడేమొ నా మేనల్లుడు. నా క్లాసుమేటు అరుణ. నీకు చెబితినే జడిగానమ్మాయి..."

"అవునవును కూర్చో అరుణా... కూర్చో."

ఆ వొదినగారి పేరేమిటోగాని అన్నపూర్ణమ్మవుతే బావుణ్ణు అనుకుంది అరుణ. ఆవిడ పేరు అన్నపూర్ణమ్మే నని తెలిసి ఆనందించింది గూడా.

బుజ్జిగాడ్ని ఎత్తుకుంది. వెధవ, తన చెవులకున్న రింగుల్ని పట్టుకులాగి బాధపెట్టేసేడు. అయితేనేం, ఎంత ముద్దొస్తున్నాడు రబ్బరు బొమ్మలా ! అన్నపూర్ణమ్మ కాఫీ చేసి తీసుకొచ్చింది. ఆ కాఫీలో అమృతమేకలిసింది కాబోలు, అరుణమ్మకది రుచిగా వున్నది.

అరుణమ్మకు అక్కడ్నుంచి కదలాలని లేదు. బయట చీకటి వొచ్చేసింది. అయినా, అరుణకి వెళ్ళి పోవాలని లేదు. ఆ వేళకి పార్వతి పెద్దన్నయ్యా, చిన్నన్నయ్యా వొచ్చేరు. వాళ్ళనీ పరిచయం చేసింది పార్వతి.

పెద్దన్నయ్యకి ఎలెసీలోనూ చిన్నన్నయ్యకి స్టేట్ బ్యాంక్ లోనూ ఉద్యోగాలట. పెద్దన్నయ్య ఎక్కువసేపు మాటాడలేదు గానీ, చిన్నన్నయ్య అరుణతో చాలాసేపు కొత్తదనం లేకుండా ఎంతో చనువుగా మాటాడేడు.

ఎంతదృష్టం నీది పార్వతీ ! పూర్వజన్మలో నువ్వు పుణ్యం చేసుకున్నావు. ఇద్దరన్నలూ నీకు రెండు కళ్ళు ! సాక్షాత్తు అన్నపూర్ణమ్మ నీ వొదిన. అదృష్టం నీది పార్వతీ !

"ఒస్తానండి. చాలా వేళయిపోయింది" అన్నది అరుణ లేచినుంచుని.

"ఇంత చీకటిలో మీ రొక్కరూ ఏం వెడతారుగానీ, నేనూ మా చెల్లి మిమ్మల్ని మీ ఇంటివరకూ దిగబెడతాం రండి" అన్నాడు చిన్నన్నయ్య. అతని పేరు శేషగిరిట.

దార్లోనూ అతనెంతో హాయిగా మాట్లాడేడు. అరుణ వాళ్ళని ఇంట్లోకి రావలసిందిగా కోరిందిగాని వాళ్లు రాలేదు. వాళ్ళు వెళ్ళిం తర్వాత అరుణ గుమ్మంలో అడుగుపెట్టింది. సరిగ్గా అక్కడే నించుంది – ఆ రోజే వొచ్చిన చిన్నొదిన.

పలకరింపుగా అరుణ దరహాసం చేసింది. దానికావిడ మొట్టమొదటిప్రశ్న–

"ఆ అబ్బాయి ఎవరు అరుణా ?"

"శేషగిరని మాక్లాసుమేట్ చిన్నన్నయ్య. ఇక్కడే స్టేటుబ్యాంకులో పనిచేస్తున్నాడు."

"అలాగా. మంచిది. సాయింత్రమనగా కాలేజి వొదిలితే నువ్విప్పుడా రావటం. ఇవతల మేమెంత బెంగపడిపోయేమో వూహించేవా ? కాలేజీకి ఫోన్ చేస్తే ఇవాళ ఫంక్షన్లుగాని మరే విశేషాలుగానీ లేవని చెప్పేడు ఎవడో గుమాస్తా. మంచిదరుణా ! నేనేమో మీ అన్నలకి అక్కడికి చెప్పిచూసేను. అరుణేం చంటిపిల్ల కాదు. మీ రనవసరంగా ఖంగారు పడ

కంతని. వాళ్ళేమైనా అనిపించుకుంటేనా? వెళ్ళమ్మా వెళ్ళు. వెళ్ళి వాళ్ళని పరామర్శించు."

అరుణ తలొంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

* * *

[ఆపేసేరేం కథా? రాయండి ఆదివిష్ణుగారూ! రాయండి. ఏమిటి సందేహిస్తున్నారు! ఓహో... అర్థమైంది లెండి. నా కథలో థ్రిల్స్‌గానీ, ట్విస్టులుగానీ, గ్లామరుగానీ ముఖ్యంగా సోషల్ పర్పస్ గానీ లేవని బెంగెట్టుకున్నారా? ఇంకేం రచయితలండి మీరు? ఇంత కథారాసి ఈ కథలో ఏవో కొన్ని "జలుబులు" లేవని చెప్పి ఎవడైనా కథని మధ్యలో ఆపేస్తారండీ. ఫర్లేదు. రాసేయండి. అంతవసరమైతే మీ ఫ్రెండ్సందరికీ నేనే సంజాయిషీ చెప్పుకుంటాను. వాళ్ళు మీ పీకట్టుకోకుండా నేను చూస్తాను. సరేనా? ఏమిటి?... రాయలేరా... ఆల్ రైట్ సార్. మీ రాయడానికిష్టం లేకపోయినంత మాత్రాన నా కథ ఆగిపోతుందా ఏం? ఇంతకుముందు చెప్పుకున్నట్టు నా కథని నేనే చెప్పుకుంటాను. కానిస్తాగ్! మీలాంటి పిరికి వాళ్ళని క్షమించను-అరుణ]

ఓనాడు మాయింట్లో నా గురించి పెద్ద చర్చ ఏర్పాటు చేసేరు. అన్నయ్యలూ, వొదినలూను. ఆ చర్చలో కొన్ని నిర్ణయాలు గబగబా చేసేరు. నా చదువు ఇంతటితో ఆపి, ఇంట్లో కూచోడం మొదటి నిర్ణయం. వాళ్ళంతా కలిసి యోగ్యుడైన ఒక మనిషిని ఎన్నిక చేసినప్పుడు, నేను తలొంచి ఆ యువకుడ్ని పెళ్ళాడడం రెండో నిర్ణయం. ఇతరత్రా నిర్ణయాలు చాలా చేసేరుగాని, ముఖ్యంగా నాకీ రెండు నిర్ణయాలే నచ్చలేదు. నేనదే మాట చెప్పినప్పుడు వొదినలు తమ కోపాన్ని ప్రకటించేరు.

పెద్దన్నయ్య సోఫాలో సర్దుక్కూర్చుని, కళ్ళజోడు మొహం మీంచి తొలగించి మరీ అన్నాడు.

"చూడరుణా! నీ మొండితనం మాకెవరికీ నచ్చడం లేదు. పెద్దవాళ్ళం మేము చెప్పింది నువ్వినిపించుకోవడం మంచిది. అవసరం కూడాను. ఎన్నో ఆలోచించిగాని మేమేదీ మాటాడం. వింటున్నావా?"

"వింటున్నాను అన్నయ్యా! నువ్వు చెప్పదలుచుకున్నదంతా చెప్పు."

"చూసేరా, చూసేరా ఆ వెటకారం పెద్దాచిన్నా లేకుండా. అమ్మాతల్లీ! మేమంతా గూడా మా తల్లిదండ్రుల దగ్గర నీ అంతే గారాంగా పెరిగేమేగాని ఇలా ఇలా తలబిరుసు సమాధానాలివ్వడం నేర్చుకోలేదు. ఎంతో ముద్దూ



ఆదివిష్ణు

ముచ్చటగా పెరిగేం. అణుకువగా మెలిగేం" అన్నది పెద్దొదిన.

నాకు చెడ్డకోపమొచ్చిన మాట నిజమేగాని ఆ కోపాన్ని దిగమింగి చెప్పేను—

"ఒదినా క్షమించు. నేను విసురుగా మాటాడినా చెప్పదలుచుకున్న దొకటే. నేనింకా చదువుతాను. నేనింతలో పెళ్ళి చేసుకోను."

"ఎందుకుచేసుకుంటావ్? వాడెవడో దిక్కుమాలిన శేషగిరి నీకు నీడలా తిరుగుతున్నాడుగా" అన్నది చిన్నొదిన.

ఈ తడవ నా కోపాన్ని ఆపుకోలేకపోయాను.

"మాట మీరకు వొదినా! నువ్వు ఎవర్తో మాటాడుతున్నావో మరిచిపోవద్దు. నాకివతల ఒక ప్రెస్టేజ్ వుంది. నేనో జిల్లాన్యాయాధికారి కూతుర్ని."

"అరుణా! చిన్నన్నయ్య బిగ్గరగా అన్నాడు.

"అరవకన్నయ్యా! మీరంతా చేరి నా మనసును పాడుచేస్తున్నారు. డాడీలేరనే ధీమాకొద్దీ నన్ను అల్లరిచేస్తున్నారు. మీరంతా నామీద పగబట్టి సాధించాలని చూస్తున్నారు. ఇది మీకు ధర్మంకాదు. మాటాడకండి నాతో."

నేనక్కడ్నుంచి వేగంగా వెళ్ళిపోయేను. నాగదిలోకి వెళ్ళి మనసు తేలికపడేంతవరకూ ఏడ్చేడ్చి సొమ్మసిల్లిపోయేను. నా భుజమ్మీద ఎవరిదో చల్లనిచేయి తగిలింది. అది డాడీచేతిలా తోచింది. ఉలిక్కిపడి లేచిచూసేను.

ఆంటీ ఏడుస్తోంది.

ఆంటీని లతలా పెనవేసుకున్నాను. ఆంటీ నా తల నిమిరింది.

"అమ్మడూ నీకేం ఫర్లేదు. పైన దేవుడున్నాడు. నీకెవరూ అన్యాయం చేయలేరు."

—ఆదివారం ఉదయం నేను కాఫీ తాగుతూన్న వేళ శేషగిరి మాయింటికొచ్చేడు. గుమ్మం దగ్గిరే అతను నుంచుండిపోయేడు. చిన్నొదిన అతన్ని అటకాయించి, కొంచెం హెచ్చుస్థాయిలో మాటాడటం మొదలుపెట్టింది.

"చూడు శేషగిరిబాబూ! నువ్విలా ఇళ్ళకి రావడం మానుకోడానికి ఎంత పుచ్చుకుంటావో ఖచ్చితంగా చెప్పు. అంతా అక్షరాలా ముట్టచెప్పడమే గాకుండా కోటిదండాలు గూడా సమర్పించుకుంటాం. మర్యాదగా బతుకుతున్న మనుషులం. మమ్మల్నెందుకు రచ్చకీడుస్తావ్ చెప్పు?"

నే నక్కడికి రివ్వున వొచ్చి చేరేను.

'వొదిన మాటలకేంగాని, మీర రండి శేషగిరిగారూ! నా గదిలో కూచుందాం. రండి.'

అతను నా వెనకాతల సిగ్గుగానూ, కొంచెం భయంగానూ వొచ్చేడు. మే మిద్దరం గదిలో కూచున్న తర్వాత వొదిన గొణుక్కోవడం స్పష్టంగా వినిపిస్తూనే వుంది. శేషగిరి తలదించుక్కూర్చునే వున్నాడు. నేనే మాటాడేను.

'మీ బుజ్జి ఎలా వున్నాడండి.'

అతను అర్థరహితంగా తలూపడంతో నేను కొంచెం బాధపడ్డాను.

'మీరేం అనుకోకండి శేషగిరిగారూ! ఈ ఇంట్లో ఎవరేమి అనుకున్నా నేను బాధపడను. మీరూ బాధపడొద్దు. చెప్పండి విషయాలు.'

అతను గొంతు తడుపుకుని అన్నాడు.

'నాకు నచ్చిన మీతో రోజుకో తడవైనా మాటాడాలని వుంటుంది. మిమ్మల్ని చూస్తూ కూచోవాలని వుంటుంది. ఏక్షణాన మీరు నాకు పరిచయమయ్యేరోగాని, నేనీ కోరికని చంపుకోలేకపోతున్నాను. అది నా సాధ్యం కావడంలేదు. ఎన్ని అవమానాలెదురైనా నేను మిమ్మల్ని విడిచివుండలేను. వుండలేను.'

'ఏమిటో మీరివాళ చిత్రంగా మాటాడుతున్నారు. స్నేహంలోని గొప్పదనం మావొదినలకి అర్థంకాదు. అది వాళ్ల ఖర్మం. దానికి మనమేం చేయగలం?'

అతను నామాట వినిపించుకున్నట్టు లేదు. ఇందాకటి ధోరణితోనే మాటలు ప్రారంభించేడు.

'అందుచేత నేనో నిర్ణయానికొచ్చేను. ఏమైనాసరె, మిమ్మల్ని విడిచి నేనొక్షణం గూడా వుండలేనింక. కనుక ... అంతె ... అవునదే మంచిది. మనిద్దరం పెళ్ళిచేసుకుందాం అరుణగారూ! నన్ను చెప్పనివ్వండి మరి. నామాటకి అడ్డురాకండి. మీఆస్తికోసం నేనీప్లాన్ వేయలేదు. నేనంత దుర్మార్గుణ్ణి కాదు. నేనీమాటలు త్రికరణశుద్ధిగా చెబుతున్నాను. నేను ఉద్యోగిని. కొంచెమో గొప్పో సంపాదనపరుణ్ణి. మిమ్మల్ని... మీకే లోటు రాకుండా నేను శ్రమిస్తాను. అలా అని హామీ ఇస్తున్నాను. అంతేగాని, ఇలా రోజూ మీ ఇంటికొచ్చి మిమ్మల్ని కలుసుకుని వెళ్ళిపోవడంలో సుఖంలేదు. ఇది మీ వాళ్ళకి గిట్టదు. అనుక్షణం మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను అరుణగారూ! మనం పెళ్ళిచేసుకుందాం. నేనీమాటతొందరపడిగానీ, ఆలోచన లేకుండాగాని అనడం లేదు. ఎన్నో రోజులు మరెన్నో గంటలాలోచించి ఈ నిర్ణయానికొచ్చేను. ఏమంటారు అరుణా?'

అతనైతే నన్ను సులువుగా అడిగేడే గాని, నేనేం సమాధానం చెప్పేది. ఇంత మంచి స్నేహితుడు, నిజానికి తొందరపడి ఈ నిర్ణయానికొచ్చి వుండడు. అతన్ని నొప్పించేదా?

'అయ్యో! శేషగిరి గారూ! మీతో నేను చేసింది స్నేహమేనండి బాబూ. మా ఇంట్లో అన్నలూ, వొదినల దగ్గిర్నుంచి నాకు లభించని స్నేహం మీ ఇంట్లో మీనుంచి లభించింది గనక మనం మంచి స్నేహితులమైపోయేం. అయ్యో! ఇప్పుడిదేం కోరికండీ! పెళ్లా? మన పెళ్ళా? పెళ్లనేది వేళాకోళం కాదండి బాబు! నేనంత ఎత్తు ఎదగలేదింక. నాకిప్పుడుకావలసింది స్నేహమే. కేవలం స్నేహం. ఏం, మీకు బిడ్డా రంగా వుందా? నాకలా అనిపించడం లేదు మరి. క్షమించండి శేషగిరిగారూ! పెళ్లనేమాట మనమధ్య తీసుకురాకండి. ఆ భావాన్ని దూరం చేసుకుని స్నేహితుడిగానే స్థిరపడండి. లేదూ ... నాకో మంచి స్నేహితుడు గూడా దూరమయ్యేడనుకుంటాను. దేవుళ్లాటి డాడీనే పోగొట్టుకున్నదాన్ని, స్నేహం చెడిపోతే బాధపడతానా? వెళ్ళిపోండి సార్. వెళ్ళిపోండి' ఇంత చెప్పాలనుకున్నదాన్ని అతని మొహంలో తాండవించే అమాయకత్వాన్ని చూడటంవల్ల, కేవలం కాత్యర్యమే చెప్పగలిగేను.

'పెళ్ళి గురించి నేనేం ఆలోచించలేదింక. మీకు పెళ్ళే ముఖ్యమైతే, ప్రస్తుతానికి శెలవ. నాకు పెళ్లవసరమైనప్పుడు, ఆ తంతుకి మీరే కావాలనుకున్నప్పుడు ఖబురంపుతాను. కదూ... ఇంకేం చెప్పగలను శేషగిరిగారూ.'

శేషగిరి లేచి వెళ్ళిపోతున్నప్పుడు అతనిమీద నాకుజాలికలిగింది. అతనట్టు వెళ్ళేడు, ఇటువదిన్నొదిననాగదిలోకొచ్చి నాతోఏదో చెప్పప్రయత్నించింది. కాని, నా కావిడ మాటలు రుచించవనే అభిప్రాయానికి నే నెప్పుడో వొచ్చేసేను గనక నే నక్కడ్నుంచి లేచి ఆంటీని పిలుస్తూ ఆ గదిని దాటేను.

* * *

దేవుడేం చేయదలిచేడోగాని, సిరిగలతల్లి అరుణమ్మ కొన్ని చిత్రమైన కష్టాల్లో పెరుగుతూనే వుంది పాపం!

— రచయిత.

□□□